సాక్షి
తిరుపతి

ఆదివారం । 26 । నవంబర్ । 2023



ఆగమోక్తం..ఆకాశ దీపం
కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆకాశ దీపాన్ని ఆగమోక్తంగా వెలిగించారు. - 8లో



వామ్మో..చిరుత
చంద్రగిరి మండలంలోని రామిరెడ్డిపల్లె పంచాయతీలో చిరుతపులి సంచరించినట్టు స్థానికులు తెలిపారు. - 8లో



సామర్థ్యాలు మెరుగుపడాలి
విద్యార్థుల సామర్థ్యాలు మరింత మెరుగుపడాలని డీఈఓ శేఖర్ ఉపాధ్యాయులను ఆదేశించారు. - 8లో

న్యూస్‌రీల్

ఉత్తమ పర్యాటక రంగాలకు దరఖాస్తులు

తిరుపతి అలిపిరి: 2024 ఏడాదికి గాను కేంద్ర పర్యాటక మంత్రిత్వశాఖ ఉత్తమ పర్యాటక రంగ గ్రామాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తిరుపతి జిల్లా పర్యాటక, సాంస్కృతికశాఖ అధికారి(డీటీఓ) రూపేంద్రనాథ్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్తమ వారసత్వ, ఉత్తమ వ్యవసాయ, ఉత్తమ హస్తకళల, ఉత్తమ బాధ్యతాయుత, ఉత్తమ చైతనవంతమైన, ఉత్తమ సాహస, ఉత్తమ క్షేమ సంబంధ పర్యాటక గ్రామ రంగాలలో అభివృద్ధి చెందుతున్న గ్రామాల నుంచి www.rura.oturirm.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇందులో ఎంపికైన ఉత్తమ పర్యాటక గ్రామాలకు గ్రామ, రాష్ట్ర, జాతీయ స్థాయి పురస్కారాలు అందించనున్నట్లు తెలిపారు. వివరాలకు వెబ్‌సైట్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

అమ్మవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



పద్మావతి అమ్మవారి ఆలయం వద్ద..

తిరుచానూరు (చంద్రగిరి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి చీమలపాటి రవి శనివారం తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు సూపరింటెండెంట్ శేషగిరి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ధ్వజస్తంభం వద్ద మొక్కుకున్న అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలు అందించారు.

ర్యాంకులు ప్రతిష్టను పెంచుతాయి



మాట్లాడుతున్న వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ భారతి

తిరుపతి తుడా: ఎన్‌ఐఆర్‌ఎఫ్, డబ్ల్యూఆర్యూ ర్యాంకులు యూనివర్సిటీల స్థాయిని, విద్యా ప్రమాణాలను పెంచుతాయని శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ డీ. భారతి అన్నారు. శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీలో శనివారం ర్యాంకింగ్ ఆవశ్యకతపై నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జాతీయ, అంతర్జాతీయ ర్యాంకుల దృష్ట్యా వాటి సాధన కోసం కసరత్తును చేపట్టాల్సి ఉందన్నారు. పరిశోధనల కోసం ఐదు శాతం నిధులు ఖర్చు చేయడం, సామాజిక కార్యక్రమాలను విస్తృతం చేయడం వంటివి ఎంతో అవసరమని తెలిపారు. ర్యాంకింగ్ కోసం దరఖాస్తుచేసే క్రమంలో పూర్తిడేటాను ఇవ్వాల్సిన విధానంపై పలు సూచనలు చేశారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్. రజిని, ప్రొఫెసర్ కె.రామమోహన్‌రావు, ప్రొఫెసర్ గుణశేఖరన్‌రాజా పాల్గొన్నారు.

నిమ్మలో రాణిస్తూ.. !

నిమ్మ సాగును పల్లెపడుచులు కొత్తపుంతలు తొక్కిస్తున్నారు. దుక్కిదున్నడం నుంచి పురుగు మందులు పిచికారీ వరకు రాటుదేలుతున్నారు. అ, ఆలు రాకపోయినా అధునాతన పద్ధతులను అవలంభిస్తున్నారు. అధిక దిగుబడులు గడిస్తూ అబ్బురపరుస్తున్నారు. రెక్కలు ముక్కలు చేసుకుంటూ ఇంటి యజమానులకు చేదోడువాదోడుగా నిలుస్తున్నారు. 'కాయ'కష్టానికి తోడు ఈ నాలుగున్నరేళ్లలో నిమ్మకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉండడంతో అధిక ఆదాయం గడిస్తున్నారు. పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తూ పదుగురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.. వెంకటగిరి నియోజకవర్గంలోని మహిళలు.. నిమ్మసాగులో 'రాణి'స్తూ.. కుటుంబాలను ఒంటిచేత్తో నడిపిస్తున్న తీరుపై సాక్షి ప్రత్యేక కథనం..

నిమ్మ సేద్యంలో ప్రతిభ చూపుతున్న మహిళలు

- పురుషులతో సమానంగా వ్యవసాయ పనులు
- నీళ్లు పెట్టడం నుంచి మందుల పిచికారీ వరకు అన్నీ తామై..
- కుటుంబాలను చక్కబెడుతూ.. భర్తలకు చేయూతనిస్తున్న పల్లెపడుచులు
- వెంకటగిరి నియోజకవర్గంలో 'నిమ్మ'ళంగా సాగుతున్న కుటుంబాలు

సమాచారం

నియోజకవర్గం	: వెంకటగిరి
మండలాలు	: ఆరు
నిమ్మతోటలు	: 10 వేల హెక్టార్లలో
పనిచేస్తున్న కూలీలు	: 25 వేల మంది
ఇందులో మహిళలు :	12,500 మందిపైనే



▶▶ ఈమె పేరు దాసరిరాజు స్వాతి. సైదాపురం మండలం, లింగసముద్రం గ్రామం. ఈమె నిమ్మతోటలో రోజువారి కూలీ. గ్రామ సమీపంలో ఉన్న నిమ్మ తోటలో వ్యవసాయ పనులు చేస్తుంటుంది. ఉదయం సద్ది కూడు మూటగట్టుకుని వెళ్లి అక్కడే ఉంటూ నిమ్మతోటకు నీరు పెట్టడం.. పురుగు మందులు పిచికారీ చేయడం లాంటివి చేస్తుంటుంది. ఆమె మగావాళ్లకన్నా దీటుగానే వ్యవసాయ పనులు చేస్తోంది.



▶▶ ఈ ఫొటోలోని మహిళ పేరు చెంచు కృష్ణమ్మ. భర్తతో కలిసి స్థానికంగా ఉన్న ఓ ఆసామి వద్ద పనిచేస్తోంది. భార్యాభర్తలిద్దరూ నిమ్మ తోటల్లోనే ఉంటున్నారు. పురుగు మందులు పిచికారీ చేయాలంటే చెంచుకృష్ణమ్మ ముందుంటుంది. ఆసామికి ఉన్న 1000 నిమ్మ చెట్లకు ఆమె ఒక్కటే పురుగుమందు పిచికారీ చేస్తుంటుంది. మగవాళ్లతో సమానంగా నిమ్మతోటల్లో సేద్యం చేస్తుంటుంది. ఆమెకు రోజువారీ కూలీ కూడా వస్తుంటుంది.



క్రిమి సంహారక మందు పిచికారీ చేస్తున్న మహిళ

సాక్షి, తిరుపతి డెస్క్: వెంకటగిరి నియోజకవర్గంలోని సైదాపురం, రాపూరు, కలువాయి, బాలాయపల్లి, డక్కిలి, వెంకటగిరి రూరల్ మండలాల్లో అత్యధికంగా నిమ్మ సాగుచేస్తుంటారు. నియోజకవర్గంలోని ఈ ఆరు మండలాల్లో సుమారు 10వేల హెక్టార్లలో నిమ్మతోటలు సాగుచేస్తున్నారు. కొద్ది మంది మినహా అందరూ నిమ్మతోటలను సాగు చేస్తున్నారు. నిమ్మ తోటల్లో పనులు చేసేందుకు ప్రత్యక్షంగా 15,000 మంది, పరోక్షంగా 10 వేల మందికి ఉపాధి దొరుకుతోంది. ఇక్కడ పనిచేసే సగం మంది కూలీలు మహిళలే కావడం విశేషం.

నిమ్మసేద్యం.. వనితా సాయం

వెంకటగిరి నియోజకవర్గంలో ఎకరాకు 100 నిమ్మ చెట్లు నాటుతున్నారు. ఇలా 25వేల ఎకరాల్లో సుమారు 2.5 లక్షల నిమ్మచెట్లను సాగుచేస్తున్నారు. మూడేళ్ల దీర్ఘకాలిక పంట అయినా కూడా ఈ ప్రాంత మహిళలు నిమ్మ సాగుపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ప్రధానంగా నిమ్మచెట్లు నాటే దగ్గర నుంచి దిగుబడి వచ్చేంత వరకు మహిళలే అన్ని పనులు చేస్తుంటారు. సామూహికంగా నిమ్మకాయలు కోస్తారు. చెట్లకు పాదులు తీసి ఎరువులు వేస్తుంటారు. పురుగు మందులు పిచికారీ చేయాలన్నా ఈ ప్రాంత మహిళలే ముందుంటారు. కాయలు కోసి మార్కెట్‌కు తరలించేంత వరకు అన్నీ తామై వ్యవహరిస్తున్నారు. ఇదేగాక గ్రామాల్లోని మహిళలు కలసికట్టుగా ఉంటూ.. వంతుల వారీగా వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. కేవలం పురుషులు వారికి సూచనలు మాత్రమే అందిస్తున్నారు.

వినూత్న పద్ధతుల్లో సాగుతాం

పొలంలో నిమ్మ మొక్కలు నాటేందుకు 14 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పుతో పాదులు తీస్తారు. ఒక అడుగు లోతు గుంత తీసి అందులో పశువుల ఎరువువేసి మొక్కను నాటుతారు. మొక్క సుమారు ఆరున్నర అడుగులు ఉండేలా చూసుకుంటారు. ముందుగా తోటలో సాగునీటి సమస్య రాకుండా ఉండేందుకు డ్రిప్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసుకుంటున్నారు. మామూలుగా అయితే ఎకరాకు 100 నుంచి 120 మొక్కలు నాటుతారు. కానీ ఇక్కడ కొందరు మహిళా రైతులు ఎకరాకు 70 నుంచి 80 మొక్కలు నాటుతున్నారు. నెలకు రెండు సార్లు దుక్కి దున్నకం చేపడుతారు. ఎలాంటి గడ్డీ లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నిమ్మసాగు సమయంలో రసాయనిక ఎరువులను తగ్గించి పూర్తిగా సేంద్రియ ఎరువులనే వేస్తున్నారు.

పెరిగిన నిమ్మ సాగు విస్తీర్ణం

గడిచిన నాలుగున్నరేళ్లలో పుష్కలంగా వర్షాలు కురుస్తుండడంతో భూగర్భజలాలు పెరిగాయి. సాగునీటి సమస్య లేకుండా పోయింది. దీనికి తోడు మార్కెట్‌లో నిమ్మకు మంచి డిమాండ్ ఉండడంతో స్థానిక రైతులు నిమ్మసాగుపై దృష్టిసారించారు. గతంలో ఐదారు వేల హెక్టార్లలోనే నిమ్మ సాగుచేసేవారు. ఇప్పుడు 10వేల హెక్టార్లపైనే సాగుచేస్తున్నారు. గతంతో పోల్చితే అప్పులన్నీ తీరిపోయాయని పలువురు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



పాదులు తీస్తూ..



కొమ్మలను కత్తిరిస్తూ..



నిమ్మకాయలు కోస్తూ..



నిమ్మతోటకు నీరు పెడుతూ..

భర్తకు చేదోడువాదోడుగా..



మా గ్రామంలో చాలా మంది నిమ్మ తోటలపైనే ఆధారపడి జీవిస్తున్నారు. మాకు 300 నిమ్మ చెట్లు ఉన్నాయి. ప్రతి రోజూ ఇంటి పనులు ముగించుకుని భర్తతో పాటు నిమ్మతోటకు వెళ్తా. నిమ్మ చెట్లకు నీళ్లు పెట్టి.. గడ్డిలేకుండా తవ్వుతుంటా. తెగుళ్లు లాంటివి వస్తే నేనే మందులు పిచికారీ చేస్తా.

– కొండూరి నాగ రత్నమ్మ, లింగసముద్రం, సైదాపురం మండలం

ప్రభుత్వ సాయం మెండు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సాగు నీటికి ఇబ్బందుల్లేకుండా పోయాయి. బోరు బావుల్లో పుష్కలంగా నీళ్లు లభిస్తున్నాయి. మరింతమంది నిమ్మసాగుచేయడానికి ముందుకొస్తున్నారు. ఉద్యానవన శాఖ కూడా రాయితీపై నిమ్మ సాగుకు నిధులు విడుదల చేస్తోంది. నిమ్మ తోటలు కలిగిన రైతులకు రాయితీపై ప్యాక్ హౌస్‌ను కూడా మంజూరు చేశారు. పంటను ప్యాక్‌హౌస్‌లో ఉంచుకుని మరుసటి రోజు ప్యాక్ చేసి మార్కెట్‌కు తరలిస్తాం.

– వై. వెంకటరత్న, లింగసముద్రం

అన్నీ ఆమే!



మా ఇంట్లో వ్యవసాయ పనులన్నీ నా భార్య వెంకటరమణమ్మే చేస్తుంటుంది. మాకు 10 ఎకరాల నిమ్మతోట ఉంది. అందులో 900 నిమ్మ చెట్లు సాగుచేస్తున్నాం. ఏడాదికి ఖర్చులన్నీ పోను రూ.7 లక్షల వరకు ఆదాయం వస్తోంది. 2021లో నేను గ్రామ సర్పంచ్‌గా ఎన్నికయ్యాను. దాంతోపాటు ఓ ప్రైవేట్ కళాశాలలో ఫ్యాకల్టీగా పనిచేస్తున్నా. వ్యవసాయ పనులన్నీ నా భార్యే చూస్తుంటుంది. మా ఇద్దరు పిల్లలను కూడా ఆమే దగ్గరుండి చదివిస్తోంది.

– వెల్లంపల్లి ప్రసాద్‌రాజు, లింగసముద్రం

ఎక్కువ మంది మహిళా రైతులే



వెంకటగిరి నియోజకవర్గంలో అధిక సంఖ్యలో నిమ్మ సాగుచేస్తున్నారు. ఇక్కడందరూ మహిళా రైతులే ఉన్నారు. నిమ్మ తోటల్లో దుక్కి దున్నకం నుంచి రాబడి వచ్చేంత వరకు సాగులో ప్రధాన పాత్ర మహిళలదే. ముందస్తుగా నిమ్మ చెట్లకు ఏయే పురుగు మందు పిచికారీ చేయాలని, ఎలాంటి ఎరువులు వేయాలి, సాగునీరు ఎలా.. ఇలా అనేక విషయాలు వారే ఫోన్ చేసి అడుగుతుంటారు.

– ఆనంద్, ఉద్యానవనశాఖ అధికారి

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో..

గ్రూప్–1, 2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు

- డిసెంబర్ 11వ తేదీన తిరుపతిలో సదస్సు
- గెస్ట్ స్పీకర్‌గా సివిల్స్ విజేత బాలలత
- లక్ష్యం: గ్రామీణ, పట్టణ విద్యార్థులకు గ్రూప్–1,2 పరీక్షలపై అవగాహన కల్పించడం

సాక్షి ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రూప్–1,2 ఉద్యోగాల భర్తీకి త్వరలోనే ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో..గ్రామీణ, పట్టణ విద్యార్థులను గ్రూప్–1,2 స్థాయి ఉద్యోగులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో.. సాక్షిఎడ్యుకేషన్.కామ్ (www.sakshieducation. com) ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఉచిత అవగాహన సదస్సులను నిర్వహించనుంది. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షిఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం మీ అందరికి తెల్సిందే.

గెస్ట్ స్పీకర్‌గా బాలలత :

ఎంతో మందిని పోటీ పరీక్షల్లో విజేతలుగా తీర్చిదిద్దుతున్న సివిల్స్ టాపర్ బాలలత గ్రూప్1, గ్రూప్ 2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సుకు గెస్ట్ స్పీకర్‌గా హాజరుకానున్నారు. ఆమె గ్రూప్1, 2 పరీక్షలపై అవగాహన కల్పించడం తోపాటు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయనున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 8977625795 ఫోన్ నెంబర్‌కు తమ పేరు, ఫోన్ నెంబర్, జిల్లా వివరాలను వాట్సాప్‌లో పంపగలరు.

ముఖ్య సమాచారం

అవగాహన సదస్సు తేదీ
డిసెంబర్ 11, 2023 (సోమవారం)


వేదిక
మహతి ఆడిటోరియం, బాలాజీ కాలనీ, టౌన్ క్లబ్ సమీపాన, తిరుపతి


సమయం
ఉదయం 09:30 నుంచి 12:30 వరకు.

వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ : 89776 25795

నేడు జిల్లాకు ప్రధాని రాక

- ఎయిర్‌పోర్ట్‌లో స్వాగతం పలకనున్న సీఎం జగన్, గవర్నర్ నజీర్





తిరుపతి అర్బన్: ప్రధా ని నరేంద్రమోదీ ఆదివారం సాయంత్రం తిరుపతి జిల్లాకు విచ్చేయనున్నారు. రేణిగుంట విమానాశ్రయంలో ఆయనకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి స్వాగతం పలకనున్నారు. అనంతరం ప్రధాని రోడ్డు మార్గాన తిరుమలకు చేరుకోనున్నారు. రాత్రి అక్కడే బసచేసి సోమవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణం కానున్నారు.

నేడు తిరుపతికి సీఎం రాక

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం తిరుపతికి విచ్చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం గన్నవరం ఎయిర్ పోర్ట్ నుంచి బయలుదేరి 6.16గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారని పేర్కొన్నారు. 6.55 గంటలకు ప్రధానికి ఎయిర్‌పోర్ట్‌లో స్వాగతం పలికి, 7.10 గంటలకు తిరిగి గన్నవరానికి బయలుదేరి వెళ్తారని తెలిపారు.

నేడు గవర్నర్ రాక

రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆదివారం సాయంత్రం 6 గంటలకు రేణిగుంట ఎయిర్ పోర్ట్‌కు చేరుకుంటారని తెలిపారు. 6.50కు దేశ ప్రధాని నరేంద్రమోదీకి స్వాగతం పలుకుతారని వెల్లడించారు. అనంతరం 7 గంటలకు తిరుమలకు చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారని వెల్లడించారు.

పటిష్ట బందోబస్తు

తిరుమల : భారత ప్రధాని తిరుమలకు రానున్న నేపథ్యంతో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లను చేపట్టారు. ఆదేవిధంగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ తిరుమలకు రానున్నారు. ఈ నేపథ్యంలో తిరుమల వ్యాప్తంగా పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. ట్రయల్ రన్ విజయవంతంగా పూర్తిచేశారు. ఇదిలావుండగా ప్రధాని హోదాలో నరేంద్రమోదీ ప్రస్తుతం నాలుగో పర్యాయం తిరుమలకు రానున్నారు.

క్లుప్తంగా

జిల్లా రచయితల సంఘం నూతన కార్యవర్గం

తిరుపతి కల్చరల్: తిరుపతి జిల్లా రచయితల సంఘం తాత్కాలిక కార్యవర్గాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి తిరుపతి జిల్లా భౌగోళికంగా ఏర్పడి సుమారు రెండేళ్లు కావస్తున్న నేపథ్యంలో తిరుపతి జిల్లా రచయితల సంఘాన్ని ఏర్పాటు చేశారు. కార్యవర్గంలో గౌరవాధ్యక్షుడుగా ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు, అధ్యక్షుడుగా డాక్టర్ సాకం నాగరాజు, ఉపాధ్యక్షులుగా డాక్టర్ రాసాని, తమటం రామచంద్రారెడ్డి, కార్యదర్శిగా డాక్టర్ మన్నవ గంగాధర్ ప్రసాద్, సహాయ కార్యదర్శులుగా యువశ్రీ మురళి, మాలేపట్టు పురుషోత్తమాచారి, కోశాధికారిగా బొందు రామచంద్రారెడ్డి నియమితులయ్యారు. సన్నాహక సమావేశ నిర్వాహకులుగా శతావధాని ఆముదాల మురళి, ఏనుగు అంకమ నాయుడు వ్యవహరించనున్నారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి


కే. బాలరాజు

సత్యవేడు: విద్యుత్ షాక్‌తో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని నరసరాజు అగ్రహారంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం.. గ్రామానికి చెందిన కే.బాలరాజు (61) శనివారం ఉదయం పశువులకు గడ్డి కోసం చెరువు కట్ట సమీపంలోని పొలాలవద్దకు వెళ్లాడు. అక్కడ గడ్డి కోసుకొని చెరువు కట్ట సమీపంలో ఉన్న 'వీర్ల తాత ఆలయం' వద్దకు చేరుకున్నాడు. పచ్చి గడ్డి మోపు ఆలయం ముందు ఉంచి గుడి గేటు తెరుస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే సత్యవేడు కమ్యూనిటీ వైద్యశాలకు తరలించగా అప్పటికే బాలరాజు మృతిచెందినట్టు డాక్టర్లు నిర్ధారించారు.

ఎరువుల పంపిణీ పూర్తి


తాయారమ్మ

తిరుపతి అర్బన్: రబీ సీజన్‌కు అవసరమైన మేరకు ఎరువులను జిల్లాలోని అన్ని సచివాలయాల పరిధిలో ఉన్న వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలకు పంపిణీ చేసినట్లు ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ తాయారమ్మ పేర్కొన్నారు. ఆమె శనివారం కలెక్టరేట్‌లోని తమ కార్యాలయం నుంచి మాట్లాడుతూ రబీ సీజన్‌కు అవసరమైన ఎరువులకు పంపిణీ ప్రతిపాదనలు మేరకు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఆ మేరకు జిల్లాలోని 445 సచివాలయ పరిధిలోని ఆర్బీకేలతోపాటు వ్యవసాయ సొసైటీలకు 10 వేల మెట్రిక్ టన్నులను పంపినట్లు తెలియజేశారు. అంతేకాకుండా మార్క్‌ఫెడ్‌లోను మరెన్ని ఎరువులను నిల్వ ఉన్నాయని వివరించారు. రైతులకు అవసరమైన మేరకు ఆర్బీకేల్లో ఎరువులను తీసుకునే సౌకర్యాన్ని కల్పించినట్లు చెప్పారు. అంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విజన్ ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- ప్రభుత్వ సంస్థలతోనే యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ
- శిక్షణ పొందిన వారు ఉపాధి పొందడమే ప్రభుత్వ లక్ష్యం
- గత ప్రభుత్వం ప్రైవేటు సంస్థలతో నామమాత్రపు స్కిల్ శిక్షణ
- 'సాక్షి'తో ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్ అజేయ్ రెడ్డి


ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్ అజేయ్ రెడ్డి

తిరుపతి సిటీ: విజన్ ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని, అందుకే రాష్ట్రం అన్నింటా ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్ అజేయ్ రెడ్డి పేర్కొన్నారు. తిరుపతి జిల్లాలోని స్కిల్ హబ్ సెంటర్లను ఆయన పరిశీలించారు. యువతకు చదువుతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్ పక్కాగా అందిస్తే ఉపాధి, ఉద్యోగాలు సులువుగా లభిస్తాయన్నారు. తిరుపతి పర్యటన నిమిత్తం వచ్చిన ఆయన 'సాక్షి'తో పలు అంశాలపై ప్రత్యేకంగా మాట్లాడారు. ఆయన మాటల్లోనే..

నాణ్యమైన శిక్షణ అవసరం

యువతకు తాము అభ్యసించిన విద్యతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్ ఎంతో అవసరం. నైపుణ్యాన్ని పెంచుకుంటే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయి. తిరుపతిలో స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ అండ్ అప్లైడ్ న్యూట్రిషన్ స్కిల్ కళాశాలలో మౌలిక సదుపాయాలు చాలా బాగున్నాయి. ఇక్కడ శిక్షణ హోటల్ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ పూర్తవగానే ప్రముఖ ఫైవ్ స్టార్ హోటల్స్‌లో ఉద్యోగాలు లభిస్తాయి. ఇందుకోసం స్కిల్ కళాశాలతో పలు ప్రముఖ హోటల్స్ ఎంఓయూ కుదుర్చుకున్నాయి. దీనిని యువత సద్వినియోగం చేసుకోవాలి. భవిష్యత్తులో టీటీడీ సంస్థలలో క్యాటరింగ్ కోసం ఇక్కడ శిక్షణ పొందిన యువత సేవలు వినియోగించుకునేందుకు అధికారులు చొరవ తీసుకునే అవకాశం ఉంది. ఇంటర్, ఐటీఐ, డిగ్రీ అర్హతతో, మూడు నెలల శిక్షణతో వంద శాతం ఉద్యోగం పొందే కోర్సులు ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రవేశపెట్టింది. ఉచిత శిక్షణ, రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. త్వరలో మరిన్ని కోర్సులను ప్రవేశపెట్టేందుకు కృషి చేస్తాం.

అవకాశాలు సద్వినియోగం చేసుకుంటున్న యువత

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడుస్తున్న కళాశాలలు, సంస్థల్లోనే స్కిల్ హబ్‌లను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏర్పాటు చేశాం. నాణ్యమైన శిక్షణ ఇస్తున్నాం. శిక్షణానంతరం అభ్యర్థులకు ధృవపత్రాలను అందచేస్తున్నాం. ప్రతిభగల అభ్యర్థులకు ఎమ్ఎన్‌సీ కంపెనీలో ఉద్యోగాలు ఇప్పిస్తున్నాం. గత ప్రభుత్వం ప్రైవేటు సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుని నామమాత్రపు శిక్షణ ఇవ్వడంతో చాలామంది యువత స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లలో చేరేందుకు మొగ్గు చూపలేదు. ప్రస్తుతం ప్రభుత్వ సంస్థలలో నాణ్యమైన శిక్షణ ఇస్తూండడంతో యువత పెద్ద ఎత్తున అవకాశాలను సద్వినియోగం చేసుకుంటోంది.

'నాక్'లో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ భేష్

తిరుపతిలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నాక్)లో టైలరింగ్, ప్లంబింగ్, ఎలక్ట్రీషియన్, నిర్మాణ రంగానికి సంబంధించిన స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ చాలా బాగుంది. శిక్షణ పొందుతున్న అభ్యర్థులు, మహిళలతో మాట్లాడాను. అందరూ శిక్షణ చాలా బాగా ఇస్తున్నారని చెప్పడం సంతోషంగా ఉంది. ఇప్పటికే ఈ ఏడాది సుమారు ఈ సెంటర్ నుంచి 260 మందికి పైగా వివిధ కోర్సులలో శిక్షణ పొందారు. వీరిలో 70శాతం మంది ఉద్యోగాలు సాధించగా, మిగిలిన వారు స్వయం ఉపాధితో సెటిల్ అయ్యారు.

డేటాఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు మంచి అవకాశాలు

డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు ప్రస్తుతం మంచి అవకాశాలు ఉన్నాయి. ఉద్యోగం పొందిన వారికి మంచి వేతనాలు లభిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ ఐటీఐ కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్లను ఏర్పాటు చేసి, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులను ప్రవేశపెట్టి, ఉచిత శిక్షణ ఇస్తోంది. ప్రతి బ్యాచ్‌కు 30 మంది చొప్పున శిక్షణ పొందుతున్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు సుమారు 192 స్కిల్ హబ్ సెంటర్లలో యువత నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందుతున్నారు. యువత ప్రభుత్వం కల్పించే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలనేది మా ధ్యేయం.

లింగ వివక్షను రూపుమాపాలి


లింగ వివక్ష వ్యతిరేక సదస్సులో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ జ్యోతి

తిరుపతి రూరల్: సమాజంలో లింగ వివక్షను రూపుమాపేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ జ్యోతి పిలుపునిచ్చారు. జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో లింగ వివక్షకు వ్యతిరేకంగా తిరుపతిలో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో మహిళా సమాఖ్య ప్రతినిధులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం తిరుపతి రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పీడీ పాల్గొని ప్రసంగించారు. సమాజంలో బాలికలకు బాలురతో సమానంగా విద్యనందించాలన్నారు. అనంతరం లింగ వివక్షకు వ్యతిరేకంగా అవగాహన కల్పించే కరపత్రాలను విడుదల చేశారు. డీఆర్‌డీఏ ఏపీడీ ప్రభావతి, సీడీపీఓ ప్రతిప, ఎంఈఓ శంకరయ్య, ఏపీయం పరశురామ్‌రెడ్డి, వెలుగు సమాఖ్య మహిళలు పాల్గొన్నారు.

బంగారు నగలు తెచ్చిస్తానని..

- రూ.10 లక్షలు కాజేసిన ఘనుడు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు

నాయుడుపేట టౌన్: దుబాయ్‌లో తక్కువ ధరకే బంగారు నగలు తెచ్చి ఇస్తానని ఓ మహిళను నమ్మించి ఆమె వద్ద ఓ వ్యక్తి రూ.10 లక్షలకు పైగా నగదు వసూలు చేసి పరారైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు బాధితురాలు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.. పోలీసుల కథనం.. నాయుడుపేట పట్టణానికి చెందిన మహిళకు ఫేస్‌బుక్‌లో ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. తాను దుబాయ్‌లో డాక్టర్‌గా పనిచేస్తున్నానని ఆమెకు మాయమాటలు చెప్పాడు. దుబాయ్‌లో బంగారు నగలు చాలా తక్కువ ధరకే వస్తాయని, రూ.10 లక్షల నగదు ఇస్తే బంగారు నగలు తీసుకుని వస్తానని మహిళను నమ్మించాడు. దీంతో ఆ వ్యక్తి చెప్పిన ఆన్‌లైన్ బ్యాంక్ ఖాతాకు ఆమె పలు విడతలుగా రూ.10 లక్షల నగదు జమచేసింది. కొద్ది రోజులు కిందట దుబాయ్ నుంచి బంగారు తీసుకుని నేరుగా చెన్నై ఎయిర్ పోర్టుకు వస్తున్నానని చెప్పి నమ్మించాడు. రెండు రోజులు కిందట ఎయిర్ పోర్టు వద్ద కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారని చెప్పి ఫోన్ పెట్టేశాడు. బంగారు నగలకు మరికొంత ట్యాక్స్ చెల్లించాలని చెప్పడంతో రూ.80 వేలకు పైగా నగదు అతని ఆన్‌లైన్ బ్యాంక్ ఖాతాకు జమ చేసింది. మరుసటి రోజు నుంచి అతని ఫోన్ నంబరు పనిచేయ లేదు. దీంతో మోసపోయినట్లు గుర్తించినట్లు ఆ మహిళ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

చంద్రగిరి: గ్రామీణ ప్రాంతాల మహిళలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు యూనియన్ బ్యాంకు గ్రామీణ ఉపాధి సంస్థ డైరెక్టర్ సురేష్ బాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణ ఈ నెల 29 నుంచి 30 రోజులు కొనసాగుతుందని పేర్కొన్నారు. తెల్లరేషన్ కార్డు కలిగి తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాలకు చెంది 19 నుంచి 45 ఏళ్లలోపు ఉండాలని, కనీసం 10వ తరగతి చదివిన నిరుద్యోగ మహిళలు అర్హులని తెలిపారు. శిక్షణలో భోజన వసతి కల్పిస్తామని, రాను-పోను ఒక్కసారి బస్సు చార్జీలు చెల్లిస్తామని పేర్కొన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని వెల్లడించారు. ఆసక్తి కలవారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్, 4 పాసుపోర్టు సైజు ఫొటోలతో సంస్థ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఒక బ్యాచ్‌కు 25 నుంచి 30 మందిని చేర్చుకుంటామని, ముందుగా వచ్చిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణాభివృద్ధి సంస్థ, ద్వారకానగర్, కొత్తపేట, చంద్రగిరి. ఫోన్ నంబరు 79896 80587, 94949 51289, 63017 17672లో సంప్రదించాలని కోరారు.

వామ్మో చిరుత?

చంద్రగిరి: మండలంలోని రామిరెడ్డిపల్లి పంచాయతీ గ్రామ పొలిమేరలో చిరుత పులి సంచరిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. శనివారం గ్రామ సమీపంలో చిరుత పులి తచ్చాడుతుండగా.. గ్రామ సర్పంచ్ కొటాల చంద్రశేఖర్‌రెడ్డికి సమాచారం అందించారు. ఆయన సంబంధిత అటవీశాఖ అధికారులకు తెలపడంతో డీఆర్వో చక్రపాణి తన సిబ్బందితో రామిరెడ్డిపల్లి పంచాయతీకి చేరుకున్నారు. పులి వేలిముద్రల కోసం అన్వేషించారు. ఆనవాళ్లు కనిపించకపోవడంతో గ్రామస్తులకు ధైర్యం చెప్పి వెనుదిరిగారు. కొద్దిరోజుల వరకు పశువులను తమ పంట పొలాల్లోనే జాగ్రత్తగా మేపుకోవాలని సూచించారు. ఎఫ్‌బీఓ రవితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఆగమోక్తం.. ఆకాశదీపం

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం ఆకాదీపాన్ని ఆగమోక్తంగా వెలిగించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రతిరోజూ ఆకాశదీపాన్ని వెలిగించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా స్వామిపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లోనే వ్యాపార చలానాలు


సమాచారాన్ని వెల్లడిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు మద్దిలేటి, నర్మద

తిరుపతి అర్బన్: జిల్లా వ్యాపారులు రిజిస్ట్రేషన్లు, లైసెన్స్‌లు పొందడానికి ఎవరికీ పైసా ఇవ్వాల్సిన పనిలేదని అంతా ఆన్‌లైన్ ద్వారా చలానాలు చెల్లిస్తే సరిపోతుందని ఆహార భద్రతా శాఖ అధికారులు మద్దిలేటి, నర్మద వెల్లడించారు. కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. ఏడాదికి రూ.12లక్షలకు తక్కువ వ్యాపారం చేస్తున్నవారు రిజిస్ట్రేషన్ చేయించుకుంటే సరిపోతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి సంబంధించి కేవలం foscos.fssai.gov.in వెబ్‌సైట్ ఒక్కటి మాత్రమే ఉందని తెలిపారు. ఆహార భద్రతా శాఖకు సంబంధించిన dfsotpt@gmail.com కు సమాచారం ఇవ్వాలని, సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని వెల్లడించారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెరగాలి

ఏర్పేడు: విద్యార్థుల సామర్థ్యాలు పెరగాలని డీఈఓ శేఖర్ అన్నారు. శనివారం ఆయన మండలంలోని మేర్లపాక ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో పాఠ్యాంశాలను చదివించారు. ఓ విద్యార్థి వర్క్ బుక్‌లోని పాఠ్యాంశాన్ని చదవలేకపోవడంతో కొంత అసంతృప్తికి గురయ్యారు. విద్యార్థులకు చదువు చెప్పకుండా ఏం చేస్తున్నారని ఉపాధ్యాయులపై మండిపడ్డారు. అభ్యసనా సామర్థ్యాలను పెంచాలని సూచించారు. మధ్యాహ్న భోజనంపై ఆరా తీశారు. నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. హెచ్‌ఎం దుర్గ పాల్గొన్నారు.

ఎస్వీయూ అభివృద్ధికి కృషి


ఇన్‌చార్జ్ వీసీగా బాధ్యతలు చేపడుతున్న ప్రొఫెసర్ జీఎం సుందరవల్లి

తిరుపతి సిటీ : ఎస్వీ యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తానని ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జీఎం సుందరవల్లి తెలిపారు. ఆమె శనివారం వర్సిటీ పరిపాలనా భవనంలో ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ ఎస్వీయూ నాక్ ఏ ప్లస్ గ్రేడ్ పొందడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలోనే ఎస్వీయూకు ప్రత్యేక గుర్తింపు ఉందని, ఎంతో మంది రాజకీయ ప్రముఖులు, అధికారులను అందించిన ఘనత ఎస్వీయూకు దక్కుతుందన్నారు. ఆమెను రిజిస్ట్రార్ మహ్మద్ హుస్సేన్, పాలక మండలి సభ్యులు, అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది సత్కరించి అభినందనలు తెలిపారు.